క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విద్యుత్‌నగర్, సౌత్‌ఎండ్ పార్కు ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు. 11కేవీ జైన్ మందిర్, కొత్తపేట ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. 11కేవీ విష్ణు థియేటర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



దాత గోవర్ధన్‌ను అభినందిస్తున్న సీఐ కృష్ణంరాజు

కందుకూరు: మండల పరిధిలోని సాయిరెడ్డిగూడకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సప్పిడి గోవర్ధన్ గ్రామ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు మంగళవారం రూ.20వేల విరాళం ప్రకటించారు. ఈ మేరకు గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ కృష్ణంరాజుకు ఆయన నగదును అందజేశారు. అనంతరం సీఐ కృష్ణంరాజు.. ఆయనను అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు బారుల తీరారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యానారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కమలనాథుల సంబురాలు



సంబురాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

కందుకూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొమురయ్య విజయం సాధించడంతో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడి ఆధ్వర్యంలో మంగళవారం సంబురాలు చేసుకున్నారు. బాణసంచాలు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.నర్సింహారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఎస్.భూమిరెడ్డి, ఎస్.వెంకటేశ్, యువమోర్చా జిల్లా నాయకుడు సుధాకర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు చెన్నారెడ్డి, మండల కార్యదర్శులు రఘునందన్, ఆంజనేయులు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ఏబీవీపీ నాయకులు ఢిల్లీ అనిల్, నరేందర్ ముదిరాజ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: వేసవికాలం నేపథ్యంలో కార్పొరేషన్ పరిధి ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ పి.సరస్వతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండుటెండల్లో బాటసారుల దాహార్తి తీర్చేందుకు.. కార్పొరేషన్ తరుపున చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్- 1,2 అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి, కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మహిళామోర్చా నాయకురాలు నివేదిత, అగిరిశెట్టి సైదులు, ప్రవీణ్‌గౌడ్ ఉన్నారు.

రోడ్లపైనే మురుగు

- గుంతలమయమైన రహదారులు
- సమస్యలతో బస్తీ వాసుల సతమతం
- పట్టించుకోని అధికారగణం



నేదునూరు కేకే బస్తీలో రోడ్లపై పారుతున్న మురుగు నీరు

కందుకూరు: మండలంలోనే అది అతి పెద్ద గ్రామ పంచాయతీ. అయినా అక్కడ మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అసౌకర్యాలతో బాధపడుతున్నారు. కానీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదీ నేదునూరు గ్రామం ఎస్సీకాలనీ, కేకే బస్తీ దుస్థితి.

అస్తవ్యస్తం..

గ్రామంలో సుమారు 6 వేలకు పైగా జనాభ, 4,500 వరకు ఓటర్లు ఉన్నారు. గ్రామ పరిధి ఎస్సీ కాలనీ, కేకే బస్తీల్లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం అధ్వానంగా మారింది. నిర్వహణ లోపంతో మురుగు జలాలు రోడ్లపైనే పారుతున్నాయి. తద్వారా తీవ్ర దుర్వాసన వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చాలా కాలంగా పరిస్థితి ఇలాగే ఉందని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇక కేకేబస్తీలో వీధి దీపాలు వెలగడం లేదని, రోడ్లన్నీ గుంతల మయంగా ఉన్నాయని ప్రజలు పేర్కొన్నారు. కనీసం భూగర్భ డ్రైనేజీకైనా మరమ్మతులు చేపట్టి, మురుగు సాఫీగా పారేలా చూడాలని కాలనీ, బస్తీ వాసులు కోరుతున్నారు.

పరిష్కరిస్తాం



నేదునూరు సమస్యలు మా దృష్టికి రాలేదు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటాము. భూగర్భ డ్రైనేజీ తదితర సమస్యలను గుర్తించి పరిష్కరిస్తాం.

– గీత, ఎంపీఓ, కందుకూరు

స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

- పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి
- ఎమ్మెల్సీ గెలుపుపై మండల కేంద్రంలో సంబురాలు



సంబురాలు చేసుకుంటున్న నాయకులు

మహేశ్వరం: రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్క కొమురయ్య ఘన విజయం సాధించడంపై మండల కేంద్రంలో నేతలు మిఠాయిలు పంచుకొని, టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి మల్క కొమురయ్య మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఘన విజయం సాధించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో రోజురోజుకు బీజేపీ బలపడుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలే బీజేపీని గెలిపిస్తాయన్నారు. అంతకుముందు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్యగౌడ్, మండల అధ్యక్షుడు టి.యాదిశ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్‌యాదవ్, మండల మాజీ అధ్యక్షుడు మాధవచారి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పంతునాయక్, దేశ్యానాయక్, ముత్యం, సురేష్, రఘుపతిగౌడ్, దేవేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

పహాడీషరీఫ్: లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా లేఅవుట్ చేసిన వెంచర్‌లలోని ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసేకునేందుకు ఎల్ఆర్ఎస్ కోసం గతంలో రూ.1000 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్ల యజమానులు అర్హులన్నారు. అనధికారిక లేఅవుట్‌లలోని ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ఈ నెల 31వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తు చేసుకున్నవారు ప్రభుత్వ గడువులోపు ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకుంటే ఎల్ఆర్ఎస్ మొత్తం ఫీజులో 25శాతం రాయితీని ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనుమతి లేని హోర్డింగులు తొలగించండి

తుక్కుగూడ: అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగులను తొలగించాలని బీజేపీ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. వాటిని ఏర్పాటు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రావిర్యాల ఎగ్జిట్-13 నుంచి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో.. ఎలాంటి పర్మిషన్ లేకుండా కొందరు హోర్డింగ్‌లు, రోడ్డు డివైడర్ మధ్య సైన్‌బోర్డులను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హోర్డింగ్‌ల అనుమతులను గత ఏడాది నుంచి నిలిపివేసిందదని చెప్పారు. ఇక్కడ వెలసిన హోర్డింగ్‌లపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులు సంఘటితం కావాలి



గోమాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న గజేందర్‌గౌడ్ తదితరులు

- భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గజేందర్‌గౌడ్

షాబాద్: రైతులందరూ పార్టీలకతీతంగా సంఘటితం కావాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గడిగె గజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేశవగూడ గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కిసాన్ సంఘ్ జెండా ఆవిష్కరించి, గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరూ పార్టీలకతీతంగా సంఘటితం కావాలని సూచించారు. రైతుల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ సభ్యులు కృష్ణయ్య, పెంటయ్య, ఒగ్గు మల్లయ్య, బీర్ల చెన్నయ్య, చంద్రయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, నాగులపల్లి చెన్నయ్య, కుమార్, పెంటయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

ఘనంగా సద్గురు రామయ్య వార్షికోత్సవం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో గల సద్గురు వారణాసి రామయ్య దేవాలయంలో 83వ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో సద్గురు వరప్రియ శిష్య బృందం గ్రామపెద్దలు, వివిధ గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన భజన మండలి ఆలపించిన భక్తి పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సద్గురు వారణాసి రామయ్యకు పూలు, పండ్లు, మహామంగళహారతి సమర్పించారు. విచ్చేసిన భక్తులకు స్వామివారి దర్శనం, తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం అందించారు. దీంతో గ్రామంలోని దత్తాత్రేయ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

మొయినాబాద్: మండల పరిధిలోని వెంకటాపూర్‌లో మంగళవారం ఎంపీడీఓ సంధ్య, హౌసింగ్ పీడీ చంపలనాయక్ సమక్షంలో లబ్ధిదారుడి ఇంటి స్థలంలో ముగ్గు పోశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నాయకులు విజయ్‌రెడ్డి, యాదగిరి, అజయ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

పాఠశాల అభివృద్ధికి సహకారం

కొందుర్గు: కొందుర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01లో పదో తరగతి పూర్తయిన విద్యార్థులు మంగళవారం హెచ్‌ఎం గోపినాథ్‌కు రూ.8వేల విరాళం అందజేశారు. అదేవిధంగా పాఠశాల తరగతి గదుల మరమ్మతు కోసం ట్రాక్టర్ కంకర, డస్ట్, 10 బస్తాల సిమెంట్ సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దాతలను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రవి, గోపి, నర్సింలు పాల్గొన్నారు.

అనవసర ఆరోపణలు సరికాదు

- మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్

షాద్‌నగర్: అధికార పార్టీ నేతలు తమపై అనవసరమైన ఆరోపణలు చేయడం సరికాదని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు అభివృద్ధిపై దృష్టి సారించకుండా ప్రతిపక్ష పార్టీ నేతలపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఫరూఖ్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ రూ.71లక్షలు మంజూరు చేయించారని, అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్‌తో ఒప్పందం కూడా జరిగిందన్నారు. ప్రభుత్వం మారడంతో పాఠశాల అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. ప్రస్తుతం విమర్శలు చేస్తున్న అధికార పార్టీ నేతలు గతంలో పాఠశాల ఆవరణలో నాసికంగా పనులు చేపట్టారని ఆరోపించారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో అంజయ్యయాదవ్ నియోజకవర్గంలో విద్యారంగాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. జేపీ దర్గా వద్ద ఎస్సీ గురుకుల పాఠశాల, కొందుర్గులో కస్తూర్బా పాఠశాల భవనాలు, పట్టణంలోని అసంపూర్తిగా ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని గత ప్రభుత్వ హయాంలో చేపట్టినట్లు తెలిపారు. విద్యాభివృద్ధి విషయంలో తమను విమర్శించడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు రవియాదవ్, జూపల్లి శంకర్, కానుగు అంతయ్య, శేఖర్, రామకృష్ణ, అశోక్‌యాదవ్, శీలం శ్రీకాంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నట్‌రాజన్

ఐకమత్యం, భక్తితో ముందుకు సాగుదాం

మొయినాబాద్‌రూరల్: శబరిమలకు పాదయాత్రగా వెళ్లే భక్తులందరూ అయ్యప్ప కృప, సంకల్పంతో ఐకమత్యంగా ఉండాలని ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, శబరిమల పాదయాత్ర బృందం నాయకుడు అల్లం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం అజీజ్‌నగర్ మున్సిపాలిటీలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో అయ్యప్ప పాదయాత్ర చేసిన భక్తులందరూ సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళ్లే భక్తులందరూ ఐకమత్యంతో ఉంటే ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వామివారి సన్నిధికి చేరుకొని దర్శించుకుంటామన్నారు. వచ్చే సంవత్సరం పాదయాత్రలో పాల్గొనే భక్తులందరి కోసం తెలంగాణ గ్రూప్ ఏర్పాటు చేశామని, ఈ గ్రూప్‌లో మెంబర్ షిప్‌గా నమోదు చేసుకోవాలని కోరారు. భక్తులందరికీ గ్రూప్ ద్వారా సౌకర్యాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పవన్‌నాయుడు, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, బుచ్చిబాబు, రమేశ్, వివిధ ప్రాంతాల అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలని వినతి

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సబితారెడ్డిని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి కోరారు. మంగళవారం నగరంలోని ఆమె నివాసంలో కలిసి గ్రామంలోని సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగూడ నుంచి కొత్తూర్ మధ్య రహదారిని, మండల కేంద్రం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలల వరకు ఉన్న రహదారిని అభివృద్ధి చేయాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా సీతారామశాస్త్రినగర్, కొత్తగూడ చౌరస్తా పరిధిలోని కాలనీల్లో భూగర్భడ్రైనేజ్, సీసీ రహదారుల నిర్మాణాలు చేపట్టేలా నిధులు కేటాయించాలని కోరానని, ఆయా సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఆయన వెల్లడించారు.



సబితారెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న ప్రకాశ్‌రెడ్డి

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి 28వ డివిజన్ కాలనీలో నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేషన్ మేనేజర్ నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందచేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. శ్రీమారుతినగర్ కాలనీలో డ్రైనేజీ పనులు పూర్తి చేయకుండా వదిలేశారని ఆరోపించారు. కాలనీ డ్రైనేజీలను అవుట్‌లెట్‌కు అనుసంధానం చేయకుండా నిలిపివేశారని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన కాలనీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. 1,8,9 లైన్లలో డ్రైనేజీని అసంపూర్తిగా వదిలివేశారని, 5,6,7 లైన్లను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఫలితంగా ఈగలు, దోమలు పెరిగి ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి అసంపూర్తి పనులను పూర్తి చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో అగిరిశెట్టి సైదులు, ప్రవీణ్, చైతన్య, మహేశ్, బాపనయ్య, అరవింద్, శ్రీనివాస్, యాదగిరి, మహేందర్, రతన్ తదితరులు పాల్గొన్నారు.

మడిగెల బకాయి చెల్లించండి

తుక్కుగూడ: మున్సిపాలిటీ దుకాణ సముదాయ మడిగెల అద్దె బకాయి చెల్లించాలని కమిషనర్ ఎ.వాణి సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎవరెవరు ఎంత బకాయి పేరుకుపోయారో నిర్వాహకులకు తెలిపామని చెప్పారు. పూర్తి బకాయి చెల్లించి, పుర అభివృద్ధికి సహకరించాలని, లేని పక్షంలో దుకాణాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్, వార్డు అధికారులు, బిల్‌కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



నిర్వాహకుల నుంచి అద్దె వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

- మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్



మాట్లాడుతున్న పూర్ణచందర్

చేవెళ్ల: వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన చేవెళ్ల మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ పరిధిలో కలిసిన ఎనిమిది గ్రామాల పరిధిలో ప్రస్తుత నీటి పరిస్థితి, నీటి వనరులపై వివరాలు సేకరించామని తెలిపారు. ఇటీవల కలెక్టర్ ఆదేశాలతో ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష కూడా నిర్వహించామన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలో 21,559 జనాభా 6వేల కుటుంబాలు, 19,685 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ వేసవిలో తాగునీటి సమస్యలకు సంబంధించి రూ.35లక్షల ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ఈ నెల 31వ తేదీవరకు ఎల్ఆర్ఎస్‌కుయ సంబంధించి 25శాతం రాయితీని కల్పించిందని, ప్లాట్ల యజమానులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న మున్సిపల్ పరిధిలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు మున్సిపాలిటీకి అందలేదని, ఒకటి, రెండు రోజుల్లో వస్తాయని తెలిపారు. అప్పటివరకు నేరుగా హెచ్ఎండీఏ నుంచి లబ్ధిదారులకు వస్తున్న మెసేజ్‌ల ప్రకారం ఆన్‌లైన్ ద్వారా ఎల్ఆర్ఎస్ కట్టుకోవాలని చెప్పారు. మున్సిపాలిటీకి ఇంకా పూర్తిస్థాయి అధికారులు సిబ్బంది రావాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతానికి మున్సిపల్ పరిధిలోని ఆరు మంది కార్యదర్శులు ఇతర మున్సిపాలిటీ నుంచి ఇన్‌చార్జిలుగా వేసిన ఒక్కరిద్దరు అధికారులతో పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు. టాక్స్ వసూళ్లకు సంబంధించిన యంత్రాలు రావాల్సి ఉందని, అవి వచ్చిన వెంటనే పన్నుల వసూళ్లు కూడా చేపడుతామని చెప్పారు.

లబ్ధిదారులను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

- సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్

మొయినాబాద్: ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో ప్రభుత్వం నిర్మించిన డబుల్ ఇళ్లను మంగళవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. అనంతరం గ్రామంలో లబ్ధిదారులను కలిసి మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను ఏడేళ్ల పాటు నిర్మించి అర్హులను గుర్తించినా.. ఈ ప్రభుత్వం లబ్ధిదారులకు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. డబుల్ ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలను వెంటనే ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. అదేవిధంగా అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని.. ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, చేవెళ్ల డివిజన్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, మహేందర్, యేసు, ఉస్మాన్, రాజేందర్ తదితరులు ఉన్నారు.



అజీజ్‌నగర్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టండి

- మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజామొయిజుద్దీన్



సురంగల్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఖాజామొయిజుద్దీన్

మొయినాబాద్: వచ్చే వర్షాకాలం నాటికి నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజామొయిజుద్దీన్ సూచించారు. మున్సిపాలిటీలోని సురంగల్, పెద్దమంగళారం గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా పరిస్థితులను తెలుసుకున్నారు. వన నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. మొక్కలు ఎండలకు దెబ్బతినకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య లోపం, మంచినీటి సరఫరా సమస్యలు లేకుండా చూస్తున్నామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తేవాలన్నారు. నల్లాలకు తప్పనిసరిగా ట్యాప్‌లు బిగించుకోవాలని సూచించారు. వేసవిలో నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, భాస్కరాచారి తదితరులు ఉన్నారు.